ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ ఎన్నిక

బోథ్, జనవరి 16: ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం కౌఠ(బీ) ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పాలెపు గంగయ్య, ఉపాధ్యక్షుడిగా పర్ల హరిప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా గడ్డం గంగాధర్, కార్యదర్శిగా పోనకంటి జైపాల్, సంయుక్త కార్యదర్శిగా జొన్నల సాయన్న, ప్రచారకార్యదర్శిగా నల్ల హరికాంత్, కోశాధికారిగా జ్ఞానేశ్వర్, కార్యవర్గ సభ్యులుగా గంగాధర్ భూమన్న, బిక్క నవీన్, బెక్కం రాజు, కడుదార హరీశ్, కల్లూరి సుభాష్, బీరెల్లి గంగాధర్, తోట చిన్న గంగయ్య, బెక్కం కరుణాకర్, దూలూరి అనిరుద్, గంగెల్ వారి విశాల్, గౌరవ సలహాదారులుగా కొంకటి గంగాధర్, దూలూరి నారాయణ, బొప్పారపు గంగయ్యను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు కుడాల స్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి గణేశ్, నాయకులు అశోక్, కారం రవి పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

పరామర్శిస్తున్న మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్

బోథ్, జనవరి 16: ఆదిలాబాద్ జిల్లా బోథ్‌కు చెందిన వంజరి సంతోష్ కుమారుడు ఇప్ప పోతారెడ్డి, లింగంపల్లి రమేశ్ ఇటీవల మృతి చెందారు. బాధిత కుటుంబ సభ్యులను గురువారం మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ పరామర్శించారు. అనంతరం లింగంపల్లి రమేశ్ కుటుంబానికి రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కూతురి చదువు కోసం సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట మాజీ సర్పంచ్‌లు శ్రీధర్ రెడ్డి, సురేందర్ యాదవ్, రైతు సంఘం అధ్యక్షుడు బొడ్డు శ్రీనివాస్, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు అల్లకొండ ప్రశాంత్, సోలంకి సత్యనారాయణ, గంగుల మల్లేశ్ ఉన్నారు.

వందశాతం ఇంటి పన్నులు పూర్తి చేయాలి

దిలావర్‌పూర్, జనవరి 16 : గ్రామాల్లో ప్రజలను చైతన్య పరిచి వంద శాతం ఇంటి పన్నులు చెల్లించేలా చూడాలని ఎంపీవో గోవర్ధన్ అన్నారు. గురువారం నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలం బన్సపల్లి, సముందర్‌పల్లి, సిర్గాపూర్, న్యాలోలం గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఆయా గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న నర్సరీలను పరిశీలించి పలు సూచనలు చేశారు. నర్సరీల్లో బ్యాగ్‌ఫిల్లింగ్ చేసిన బస్తాల్లో విత్తనాలు నాటి మొక్కలు పెంచాలని సూచించారు. మొక్కల పెంపకంపై ఈజీఎస్ ఫీల్డ్‌అసిస్టెంట్లు దృష్టి సారించాలని సూచించారు. గ్రామ పంచాయతీల అభివృద్ధిలో భాగమైన ఇంటి పన్నులు వంద శాతం చెల్లించేలా ప్రజలను చైతన్య పరుస్తూ పన్నులు తీసుకురావాలని కోరారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలి

భైంసా, జనవరి 16 : నిర్మల్ జిల్లా భైంసాలోని గోపాల్‌రావు పటేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు పీఎం ఉషా పథకం కింద రూ.5 కోట్లు మంజూరయ్యాయని వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధ్యాపకులు గురువారం ఎమ్మెల్యే రామారావు పటేల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పనులు తక్షణమే ప్రారంభించేలా అధికారులకు సూచనలు ఇస్తామన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో కళాశాల ప్రిన్సిపాల్ కర్రోల్ల బుచ్చయ్య, వైస్ ప్రిన్సిపాల్ రఘునాథ్, అధ్యాపకులు భీంరావ్, సుధాకర్, డాక్టర్ పీజీ రెడ్డి, శంకర్, ఓంప్రకాశ్, సురేందర్, మోహన్ ఉన్నారు.

సర్వే వివరాలు సక్రమంగా నమోదు చేయాలి

ఇంద్రవెల్లి, జనవరి 16: ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం అర్హులను గుర్తించే సర్వే వివరాలు సక్రమంగా నమోదు చేయాలని తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో భాస్కర్ అధికారులకు సూచించారు. గురువారం మండలంలోని గ్రామాల్లో అధికారులు చేపడుతున్న సర్వేను వారు పరిశీలించి నమోదు చేసిన వివరాలను పరిశీలించారు. వారి వెంట ఎంపీవో జీవన్‌రెడ్డి, ఇంద్రవెల్లి జీపీ ఈవో సంజీవరావ్, గ్రామ పంచాయతీ అధికారులు ఉన్నారు.

అయోడిన్ వాడకంతో ఆరోగ్యం

గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న కళాకారులు

లక్ష్మణచాంద, జనవరి 18: అయోడిన్ ఉపయోగించడం ఆరోగ్యానికి ఎంతో మంచిదని ఆశీర్వాద్ స్మార్ట్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ డెవలప్‌మెంట్ జిల్లా కోఆర్డినేటర్ మునగాల హుస్సేన్ పేర్కొన్నారు. గురువారం నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద, మల్లాపూర్, ముసిపెల్లి గ్రామాల్లో కళాజాత బృందం ఆధ్వర్యంలో అవగాహన సమావేశం నిర్వహించారు. వారు పాటలు, నాటికలతో పోషకాహారంపై ప్రజలకు అవగాహన కల్పించారు. అయోడిన్ ఉపయోగాలు వివరించారు. కార్యక్రమంలో ఔట్‌రిచ్ వర్కర్ గంగుల శివశంకర్, ఏఎంసీ వైస్‌చైర్మన్ ఈటెల శ్రీనివాస్, హెచ్‌ఈవో హరికుమార్, ఆశకార్యకర్తలు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

20న జాతీయ శిక్షణ మేళా

ఉట్నూర్, జనవరి16: ఈ నెల 20న ఉట్నూర్ గిరిజన ప్రభుత్వ ఐటీఐలో ప్రధానమంత్రి జాతీయ శిక్షణ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రమేశ్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ పూర్తిచేసిన అభ్యర్థులకు శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించడానికి ఈ మేళాను ఉట్నూర్ ఐటీఐ ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో ఐటీసీ ఫుడ్ డివిజన్ హైదరాబాద్, ఎల్‌జీ హోం హైదరాబాద్, ఎల్ అండ్‌టీ పుణే వంటి ప్రముఖ కంపెనీలు పాల్గొనబోతున్నాయన్నారు. అభ్యర్థులు ఐటీఐ పాస్ సర్టిఫికెట్, 10వ తరగతి మెమో, ఆధార్‌కార్డు, అప్రెంటీస్ రిజిస్టేషన్ జిరాక్స్ కాపీలతో గూగుల్ ఫాం https: // forms. gle/ 8qdh t6 jl MxH a9 acis9 ద్వారా నమోదు చేసుకోవాలని కోరారు.

PUBLIC NOTICE

General public are hereby informed that my client **M/s Shriram Finance Ltd, Khanapur Branch, Dist Nirmal** agreed to accord Loan to **Shaik Sabeer S/o Shaik Mathin,** Age 35 Yrs, Occ:Business, R/o H.No.14-122, Subhash Nagar, Khanapur (V) Khanapur (M), Nirmal (Dist) mortgage of the schedule referred property. The above prospective loanee agreed to create first charge against schedule property mentioned below in favor of my client company. If any person having any title, claim, or objection of whatsoever nature may put forth their claims before me within **7 days** of this notice. The objections raised afterwards shall be deemed to be 'Waived' and not binding on my client Company and my client shall proceed further for according above loan by Mortgage of the schedule property. Hence this notice

SCHEDULE OF THE PROPERTY

Village:Khanapur, Khanapur Municipality, Mandal Khanapur, Dist:Nirmal, The H.Nos. 14-73 & 14-73/1 total extent 1770.00 Sq.feets = 196.66 Sq.Yards equal to 164.43 Sq.Meters, RCC Plinth Area 1021.87 Sq.Feets, Bengluru Tiles Plinth Area 120.00 Sq.feets and Tin Shed Plinth Area 360.00 Sq.Feets situated at Khanapur Municipality, (Subhash Nagar), situated at Khanapur Village, Khanapur Mandal, Nirmal District, TPIN Nos. 1237102860, 1237102861, Under the jurisdiction Registration District Adilabad, Revenue District Nirmal, Sub District Khanapur. **Boundary as East :** House of Gousiya Begum, **West :** Open place of Pochamma Temple, **North :** House of Shaik Sadheeq, **South :** Municipality Road

Sd/- R.JAGADISHWER RAO, Advocate
Subhashnagar, Nizamabad, Cell: 9848094409

బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి

● కాంగ్రెస్ ప్రభుత్వానికి ఫ్లెక్సీలపై ఉన్న దృష్టి అభివృద్ధిపై లేదు ● బీఆర్ఎస్ మైనార్టీ సీనియర్ నాయకుడు సాజీదుద్దీన్

మాట్లాడుతున్న బీఆర్ఎస్ మైనార్టీ సీనియర్ నాయకుడు సాజీదుద్దీన్

ఎదులాపురం, జనవరి 16 : కాంగ్రెస్ ప్రభుత్వానికి ఫ్లెక్సీలపై ఉన్న దృష్టి అభివృద్ధి చేయడంపై లేదని బీఆర్ఎస్ మైనార్టీ సీనియర్ నాయకుడు సాజీదుద్దీన్ అన్నారు. గురువారం ఆదిలాబాద్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వంలో మాజీమంత్రి జోగు రామన్న వేల కోట్ల రూపాయలతో ఆదిలాబాద్ అభివృద్ధిని చేసి చూపించిన ఘనత ఆయనకు దక్కిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధిపై దృష్టి సారించడం మాని ఫ్లెక్సీలపై దృష్టి సారించడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజాపాలన పేరుతో 200 యూనిట్ల కరెంట్, ఇండ్ల పంపిణీ, వృద్ధుల పింఛన్లు, రేషన్ కార్డులపై దృష్టి సారించాలన్నారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు వారితో పాటు ప్రభుత్వ యంత్రాంగం మొద్దు నిద్ర పోతుందన్నారు. ఒక పక్క అభివృద్ధి పక్కదారి పడుతుంటే మరో పక్క ఆదిలాబాద్ తలమానికంగా ఉన్నటువంటి కమాన్‌కు కంది శ్రీనివాస్ రెడ్డి ఫ్లెక్సీని తలగించే అభివృద్ధిని మూసివేయడం సిగ్గుచేటు అన్నారు. జోగు రామన్న హయాంలో రోడ్లతో పాటు హోర్డింగులు ఏర్పాటు చేయడం జరిగిందని వాటిని వాడుకోవాలని ఎద్దేవా చేశారు. కలెక్టర్ కార్యాలయం ముందు గేటు విరిగిపడిపోయి ఉన్న ప్రభుత్వ యంత్రాంగం అక్కడ దృష్టి సారించక పోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం నిలుస్తుందని కొనియాడారు. అదిలాబాద్ కమాన్‌కు కట్టిన కాంగ్రెస్ ఫ్లెక్సీలను అధికారులు తొలగించకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వచ్చిందని సాజీదుద్దీన్ హెచ్చరించారు. అలాగే కలెక్టరేట్ కార్యాలయ గేట్లు కూడా పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు చందాల రాజన్న, దమ్మా పాల్, తన్నవీర్, బుట్టి శివ, సంతోష్, ఐయూబ్, ఐన్సన్, ఆసిఫ్ పాల్గొన్నారు.

మహాధర్నాను విజయవంతం చేయాలి

నార్నూర్, జనవరి 16 : ఏజెన్సీ చట్టాలు పకడ్బందీగా అమలు చేయాలని ఈ నెల 20వ తేదీన ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయం ఎదుట నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శి సెడ్మాకి రామారావు పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరులతో సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత రాజ్యాంగంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పొందుపర్చిన 5,6 షెడ్యూల్‌ను క్షేత్ర స్థాయిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయడం లేదని ఆరోపించారు. గిరిజన సంక్షేమ శాఖలోని 29 విభాగాలలో వంద శాతం రిజర్వేషన్‌తో పాటు జీవో నంబర్ 3ను, ఏజెన్సీ ప్రాంత చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని, పోడు భూములకు పట్టాలు ఇవ్వాలన్నారు. 50 శాతం ఆదివాసులు ఉన్న గ్రామాలను ఏజెన్సీ గ్రామాలుగా గుర్తించాలని డిమాండ్లతో మహాధర్నాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తొమ్మిది తెగల ఆదివాసులు, రాయిసెంటర్ సార్‌మేడిలు, ఆదివాసీ అనుబంధ సంఘాల నాయకులు, ఆదివాసీ ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, నిరుద్యోగులు, మహిళలు, ఆదివాసీ సమాజ పెద్దలు తరలిరావాలని ఆయన కోరారు. సమావేశంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండలాధ్యక్షుడు పూసం ఇర్రూ, ప్రధాన కార్యదర్శి గోవింద్, జిల్లా నాయకులు ఉమేశ్, పూసం బాపురా, తొడసం సోంజీ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

కడెం, జనవరి 16 : నిర్మల్ జిల్లా కడెం మండలంలోని మోర్రిగూడెం గ్రామానికి చెందిన సాదు రాజేందర్(42) చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. ఎస్ఐ కృష్ణాసాగర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సాదు రాజేందర్(42) మద్యానికి బానిసై ఇంట్లో ఏమి పని చేయకుండా ఉండేవాడు. పని చేయకుంటే ఎలా బతికేది, అప్పులు ఎలా తీర్చేది అని అంటూ మద్యం తాగవద్దు భార్య చెప్పినందుకు మనస్తాపానికి గురై జీవితంపై విరక్తి చెంది సాదు రాజేందర్ ఈ నెల 13వ తేదీన పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఖానాపూర్‌కు తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం నిర్మల్‌కు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ బుధవారం రాత్రి 11.30 గంటలకు మృతి చెందాడు. భార్య అనూష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య

లక్ష్మణచాంద, జనవరి 18: నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలం తిర్‌పల్లి గ్రామానికి చెందిన సిలారి ధర్మారం సురేశ్(22) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ సుమలత తెలిపారు. ఎస్ఐ, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సిలారి ధర్మారం సురేశ్ ఐదు నెలల క్రితం దుబాయి నుంచి స్వదేశానికి తిరిగివచ్చాడు. అప్పటి నుంచి మద్యానికి బానిసై పిచ్చిపిచ్చిగా ప్రవర్తించేవాడు. ఈ నెల 13వ తేదీన తన వ్యవసాయ భూమిలో పని చేయడానికి వెళ్లి పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని చికిత్స నిమిత్తం నిజామాబాద్‌లోని దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుని తల్లి ముత్తవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుమలత తెలిపారు.

భైంసాకు చేరుకున్న యాత్రికులు

భైంసా, జనవరి 16: మూడు రోజుల క్రితం యూపీలోని బృందావన్‌లో బస్సు దహనమైన ప్రమాదంలో ఒకరు మృతి చెందిన విషయం తెలిసిందే. మిగిలిన 49 మంది గురువారం సాయంత్రం నిర్మల్ జిల్లా భైంసాకు చేరుకున్నారు. యాత్రికులు భైంసాకు చేరుకోవడంతో వారి కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు.

ఉపకార వేతనం కోసం దరఖాస్తు చేసుకోవాలి

ఎదులాపురం, జనవరి 16: తెలంగాణ కార్మిక సంక్షేమ మండలి ద్వారా అమలు చేస్తున్న కార్మికుల పిల్లలు, కార్మికుల ఉపకార వేతనాల కోసం దరఖాస్తు చేసుకోవాలని అసిస్టెంట్ కమిషనర్ ముత్యం రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24 విద్యాసంవత్సరంలో ఉత్తీర్ణులైన వారికి ప్రతిభ ఆధారంగా ఉపకార వేతనాల కోసం దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. తెలంగాణ కార్మిక సంక్షేమ మండలి కింద అమలు చేయుచున్న సంక్షేమ పథకాలలో భాగంగా దుకాణాలు, వాణిజ్య సంస్థలు, కర్మగారాలు, మోటారు రవాణా సంస్థలు, సహకార సంస్థలు ధార్మిక లేదా ఇతర ట్రస్టుల్లో పని చేస్తున్న కార్మికుల పిల్లలు, కార్మికులకు సంబంధించిన దరఖాస్తు ఫారాలు సంబంధిత, సహాయ కార్మిక కమిషనర్ వారి కార్యాలయంలో పొందవచ్చని తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులు ఫిబ్రవరి 15లోగా సంబంధిత కార్మిక శాఖ కార్యాలయంలో అందజేయాలని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ రాజలింగు తెలిపారు. గడువు తర్వాత వచ్చిన దరఖాస్తులను తిరస్కరించబడుతాయని తెలిపారు. ఈ అవకాశాన్ని కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పేకాట స్థావరాలపై పోలీసుల దాడులు

సారంగాపూర్, జనవరి 16: నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం బండ రేవుతండాలో నానుమహారాజ్ జాతర ముసుగులో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న పేకాట స్థావరాలపై బుధవారం రాత్రి పోలీసులు దాడులు నిర్వహించారు. జాతర ముసుగులో పెద్ద ఎత్తున పేకాటాడుతున్నారన్న విషయం తెలుసుకున్న పోలీసులు ఎస్పీ జానకీ షర్మిల ఆదేశాల మేరకు జిల్లా అడిషనల్ ఎస్పీ రాజేష్‌మీనా నేతృత్వంలో స్థావరాలపై దాడులు చేశారు. జాతరకు 100 మీటర్ల దూరంలో ఎవరికి అనుమానం రాకుండా ఆట బొమ్మలు వివిధ సామగ్రి అమ్మే విధంగా దుకాణాలు మాదిరిగా టెంట్లు వేసి ఆడుతున్నారు. పోలీసులు చాకచక్యంగా వీటిని గుర్తించి దాడులు చేశారు. ఈ పేకాట స్థావరాల్లోని మహారాష్ట్ర, నిర్మల్ జిల్లాలోని వివిధ మండలాల వ్యక్తులు వచ్చి పేకాట ఆడడంతో కోట్లది రూపాయాలు చేతులు మారుతున్నాయి. దీంతో పోలీసులు దాడి చేయడంతో జూదరులు తమ ప్రదేశాలను ఖాళీ చేసి వెళ్లి పోగా, మరి కొందరు టెంట్లు వదిలి వెళ్లి పారిపోయారు. గురువారం కూడా పేకాట ఆడకుండా పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేశారు.

ఆదర్శనగర్‌లోని ఇంట్లో దొంగతనం

ఎదులాపురం, జనవరి 16 : మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆదర్శనగర్‌లోని ఇంట్లో దొంగతనమైనట్లు మావల ఎస్ఐ విష్ణువర్ధన్ తెలిపారు. కాంబ్లే ఉద్దవ్ ఈ నెల 14వ తేదీన ఇంటికి తాళం వేసి నార్నూర్ మండలం సొంత ఊరికి వెళ్లారు. అక్కడి నుంచి తిరిగి గురువారం ఇంటికి వచ్చారు. ఇంటికి వేసిన తాళం పగిలి ఉంది. ఇంట్లోని బీరువాలో దాచి ఉంచిన నాలుగు తులాల బంగారు ఆభరణాలు దొంగలు ఎత్తుకెళ్లారు. కాంబ్లే ఉద్దవ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రైతు భరోసా పథకంపై సర్వే

దిలావర్‌పూర్/తలమడుగు/నర్సాపూర్ (జీ), జనవరి 16: నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్, బన్సపల్లి, గుండంపల్లి, మాడెగాం, సముందర్‌పల్లి, నర్సాపూర్(జీ) మండలం గొల్లమాడ, నందన్, అంజనితాండా గ్రామాల్లో వ్యవసాయ, రెవెన్యూ శాఖ అధికారులు, ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలోని పలు గ్రామాల్లో మండల వ్యవసాయ శాఖాధికారి ప్రమోద్ రెడ్డితో పాటు ఏఈవోలు కలిసి రైతుభరోసా పథకానికి సంబంధించిన భూములపై సర్వే చేశారు. దిలావర్‌పూర్ మండలంలోని సర్వేను గురువారం తహసీల్దార్ స్వాతి పరిశీలించి వారికి పలు సూచనలు చేశారు. దిలావర్‌పూర్ మండలంలో ఏవో రాజశేఖర్, ఆర్ఐ సంతోష్‌కుమార్, ఏఈవో శ్రీవాణి, మౌనిక, తలమడుగు మండలంలో ఏఈవో రమేశ్, నర్సాపూర్ (జీ) మండలంలో పంచాయతీ కార్యదర్శి సంధ్య రెడ్డి, వెంకటేశ్, సంస్కృతి, సర్వేయర్ మోహన్ కృష్ణ, మండల వ్యవసాయాధికారి రాంచందర్ నాయక్, ఆర్ఐ వేణుగోపాల్, వ్యవసాయ విస్తరణాధికారి గణేశ్, రమ్య, భాగ్యలక్ష్మి (రెవెన్యూ), సీనియర్ అసిస్టెంట్ పుష్పలత, జూనియర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ అదృశ్యం

వాంఖడే సాయిరామ్

ఎదులాపురం, జనవరి 16: ఆదిలాబాద్‌లోని భుక్తపూర్‌కు చెందిన వాంఖడే సాయిరామ్(25) ఆటో డ్రైవర్ అదృశ్యమైనట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. ఈ నెల 15వ తేదీన ఉదయం 9.30 గంటలకు ఇంటి నుంచి వెళ్లిపోయి రాలేదు. చుట్టూ పక్కల బంధువుల ఇండ్లలోకి వెతికిన ఆచూకీ లభించలేదు. భార్య గౌరిరీనా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

దేశీదారు బాటిళ్లు స్వాధీనం

ఎదులాపురం, జనవరి 16 : ఆదిలాబాద్‌లోని మహాలక్ష్మివాడకు చెందిన దినేశ్ వద్ద 140 దేశీదారు బాటిళ్లను గురువారం స్వాధీనం చేసుకున్నట్లు టూటౌన్ సీఐ సీహెచ్ కరుణాకర్ రావ్ తెలిపారు. మహారాష్ట్ర నుంచి అక్రమంగా దేశీదారు తీసుకొచ్చి పట్టణంలో విక్రయించే క్రమంలో రైల్వే స్టేషన్ సమీపంలో దినేశ్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతనిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఒకరిపై కేసు

సోన్, జనవరి 16 : నిర్మల్ పరిధిలోని విశ్వనాథ్‌పేట్ కాలనీ సమీపంలో గురువారం ఏఎస్ఐ దేవేందర్‌గౌడ్, సిబ్బంది రాజ్‌కుమార్, రమేశ్ వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఆదిలాబాద్ నుంచి నిర్మల్‌కు ద్విచక్రవాహనంపై వస్తున్న వ్యక్తి కానిస్టేబుల్ రమేశ్‌ను ఢీ కొట్టడంతో గాయాలయ్యాయి. ప్రమాదానికి కారణమైన వ్యక్తి వెంటనే అక్కడి నుంచి పారిపోయాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లింబాద్రి తెలిపారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

నాగపూర్ జట్టుకు ప్రథమ బహుమతి అందజేస్తున్న మాజీ జడ్పీటీసీ పతాంగే బ్రహ్మానంద్

గుడిహత్నూర్, జనవరి 16 : క్రీడల్లో గెలుపోటములు సహజమని మాజీ జడ్పీటీసీ పతాంగే బ్రహ్మానంద్ అన్నారు. స్వామి వివేకానంద జయంతి పురస్కరించుకుని ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్ మూడు రోజుల పాటు కొనసాగింది. బుధవారం అర్ధరాత్రి ఫైనల్ మ్యాచ్‌లో నాగపూర్ వర్సెస్ భద్రాచలం జట్ల మధ్య తలపడ్డాయి. చివరికి నాగపూర్ జట్టు ప్రథమ బహుమతి కింద రూ.51వేల నగదుతో పాటు కప్పును మాజీ జడ్పీటీసీ పతాంగే బ్రహ్మానంద్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆడె శీల అందజేశారు. కార్యక్రమంలో వివిధ పార్టీ నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడుపొద్దు

మాట్లాడుతున్న పీఆర్‌వో కేసర్ సింగ్

జైనథ్, జనవరి 16 : వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడుపొద్దని నేషనల్ హైవే పీఆర్‌వో కేసర్ సింగ్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా గురువారం ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలంలోని భోరజ్ బస్టాండ్ ఆవరణలో వాహనదారులకు అవగాహన కల్పించి పలు సూచనలు, సలహాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని జాబ్రా క్రాసింగ్‌కు సంబంధించిన ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలన్నారు. పలు అం శాలపై వాహనదారులకు కరపత్రాలను అందజేసి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈపీఎల్ సిబ్బంది ఎస్ విఠల్, ఎస్ సురేశ్, డీవీఆర్ వెంకన్న, ఏఈపీఎల్ సిబ్బంది, భోరజ్ గ్రామస్తులు, వాహనదారులు పాల్గొన్నారు.

కళాసంగమం సంగీత, సాహిత్య సాంస్కృతికోత్సవానికి వెంకట్ ఎంపిక

పద్యకవి బీ వెంకట్

నిర్మల్ అర్బన్, జనవరి 16 : నిర్మల్‌కు చెందిన ప్రముఖ పద్యకవి, వ్యాఖ్యాత, సంస్కృత భాషా ప్రచార సమితి ఆదిలాబాద్, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల వ్యవస్థాపక అధ్యక్షుడు బీ వెంకట్ వాగ్దేవి కళాపీఠం ఆధ్వర్యంలో ఈ నెల 19, 20 తేదీల్లో హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో నిర్వహించే కళాసంగమం, సంగీత సాహిత్య, సాంస్కృతికోత్సవానికి ఎంపిక య్యారు. సాంస్కృతికోత్సవానికి వెంకట్ ఎంపిక కావడంపై పలువురు సాహితీ అభిమానులు అభినందించారు.

డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి స్పందన

ఎదులాపురం, జనవరి 16: ఆదిలాబాద్ ఆర్టీసీ డిపోలో గురువారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి విశేష స్పందన లభించిందని డిపో మేనేజర్ కల్పన తెలిపారు. భీంపూర్ మండలంలోని కరంజి రూట్‌లో గుబిడి వరకు బస్సు సౌకర్యం కల్పించాలని, బేలకు ఎక్స్‌ప్రెస్ బస్ సౌకర్యం కల్పించాలని, గుడిహత్నూర్ బస్టాండ్‌లో రద్దీకి అనుగుణంగా సెక్యూరిటీని నియమించాలని ఫిర్యాదులు వచ్చాయన్నారు. అన్ని ఫిర్యాదులను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామన్నారు.

ఆర్థిక సాయం

ఆర్థిక సాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

ఇచ్చోడ, జనవరి 16: ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలోని ముక్రా(బీ) గ్రామానికి చెందిన శివంగి అనే బాలిక తలసేమియా వ్యాధితో బాధపడుతుంది. కాగా ఆమె దవాఖాన ఖర్చుల కోసం మండల కేంద్రానికి చెందిన 2007-08 బ్యాచ్ విద్యార్థులు సాయి, మురళి, శివ, బాలాజీ తమ వంతుగా బాధిత కుటుంబానికి రూ.21వేల ఆర్థిక సాయం అందజేశారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

అడవిపందుల దాడిలో మక్కపంట ధ్వంసం

ధ్వంసమైన మక్కపంటను పరిశీలిస్తున్న ఏఈవో పవిత్ర

లక్ష్మణచాంద, జనవరి16: నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలం వడ్యాల్ గ్రామంలోని రావులబండి సాయన్నకు చెందిన మక్క పంటను బుధవారం రాత్రి అడవిపందులు ధ్వంసం చేశాయి. గురువారం ఏఈవో పవిత్ర, ఎఫ్‌బీవో సంతోష్ ధ్వంసమైన మక్కపంటను పరిశీలించారు. మక్కపంట నష్టంపై నివేదిక రూపొందించి ప్రభుత్వానికి పంపుతామని వారు తెలిపారు. ప్రభుత్వం సహాయం చేసి తనను ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

దిలావర్‌పూర్, జనవరి 16: నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలంలోని సిర్గాపూర్ గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.10 లక్షలతో చేపట్టే సీసీ రోడ్డు నిర్మాణానికి గురువారం ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. అనంతరం ఓడ్డెపల్లి గ్రామంలో ఎస్‌డీపీ నిధులతో చేపట్టనున్న సంఘ భవన నిర్మాణానికి భూమి పూజ